క్లుప్తంగా

రూ.75వేల ఆర్థికసాయం



మహబూబాబాద్ అర్బన్: ఆపదలో ఉన్న వారికి చేయూతనందించాలని ఉషోదయ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పాలబిందెల మల్లయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని కంకర బోడ్ ప్రాంతానికి చెందిన ఎర్రోజు శేఖర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. శుక్రవారం శేఖర్ కుటుంబానికి అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.75వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో శంభయ్య, సుధాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, మైపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాస్, అశోక్, రామయ్య పాల్గొన్నారు.

పట్టాలు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: దళితులకు సంబంధించిన అసైన్డ్ భూములను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్యమాదిగ డిమాండ్ చేశాడు. దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని నిరసన కార్యక్రమాల కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాధా, సుధారాణి, బాలరాజు, సందీప్, సాంబయ్య పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మహబూబాబాద్ అర్బన్: గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న బాల, బాలికలపై హెచ్‌డబ్ల్యూలు ప్రత్యేక శ్రద్ధచూపాలని ఏటీడీఓ దేశీరామ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం వడ్డించాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత స్థానాల్లో ఉద్యోగాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో గిరజన ఆశ్రమ పాఠశాల హెచ్‌డబ్ల్యూ అనిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు

నర్సింహులపేట: మండలంలోని పడమటిగూడెం శివారు గ్యామాతండాలోని హనుమాన్ ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రారంభ వేడుకల్లో శుక్రవారం ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పాల్గొన్నారు. అనంతరం ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.

పదవులు సమర్థులకు ఇవ్వాలి

తొర్రూరు: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకలవ్య కార్పొరేషన్ పదవులు సమర్థులకు కేటాయించాలని వైహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరాయ సాయిలు అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో సంఘం సమావేశంలో సాయిలు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కేబినెట్ తీర్మానంతో ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయడాన్ని హర్షిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, సంపత్, సదానందం, సోమయ్య, సందీప్ పాల్గొన్నారు.

పాఠశాలకు మ్యాట్ అందజేత

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలోని జెడ్పీహైస్కూల్‌కి చెందిన 2004–05 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వవిద్యార్థులు అదే పాఠశాలకు రూ.16వేల విలువైన మ్యాట్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు సదానందం, అశోక్, శివ, లింగయ్య, సంతోష్, పీడీ కొమ్ము రాజేందర్ పాల్గొన్నారు.

పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాజన్‌బాబు



కొత్తగూడ: మండల కేంద్రానికి చెందిన కుసుమ రాజన్ బాబును పద్మశాలి సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా రాష్ట్ర అధ్యక్షుడు ఎంపిక చేశాడు.

సమన్వయంతో పనిచేయాలి

కొత్తగూడ: ధాన్యం సేకరణలో ఐకేపీ, వ్యవసాయశాఖ, జీసీసీ, పీఏసీఎస్ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని తహసీల్దార్ రమాదేవి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

పంటసాగుపై అవగాహన పెంచుకోవాలి



కేసముద్రం: యువత పంటల సాగుపై అవగాహన పెంచుకోవాలని గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు కిషన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అమీనాపురం గ్రామంలోని ఓ వివాహ వేడుకకు వద్దిరాజు కిషన్ హాజరై వెళ్తూ.. పంట క్షేత్రాలను పరిశీలిస్తున్న అగ్రికల్చర్ విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో చందాగోపి, స్వామి, ఏకాంతం పాల్గొన్నారు.

చెరువుల్లో చెత్తకుప్పలు..

- డోర్నకల్‌లో డంపింగ్ యార్డు కొరత
- రోజూ టన్నుల కొద్ది చెత్త సేకరణ
- పెద్ద చెరువు, బందంకుంటలకు తరలింపు



బందంకుంట కట్ట పక్కన పేరుకుపోయిన చెత్త

డోర్నకల్: నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రం, మున్సిపాలిటీ, రైల్వే జంక్షన్‌గా గుర్తింపు పొందిన డోర్నకల్‌లో మాత్రం డంపింగ్ యార్డు లేదు. పట్టణం నుంచి సేకరించిన చెత్తను పడేయడానికి స్థలం దిక్కు లేదు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో సెయింట్ ఆగ్నేస్ స్కూల్ సమీపంలో డంపింగ్‌యార్డు ఉండగా నివాసాలకు సమీపంలో ఉందంటూ యార్డుస్థలంలో పట్టణ ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేశారు. అమ్మపాలెం సమీపంలోని ప్రభుత్వ భూమిలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులు ప్రయత్నించగా అమ్మపాలెం గ్రామస్తుల అభ్యంతరాలతో యార్డు ఏర్పాటు పనులు నిలిచాయి.

టన్నుల కొద్ది చెత్త సేకరణ

మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డుల నుంచి ప్రతీ రోజు నాలుగు నుంచి ఆరు వాహనాలతో టన్నుల కొద్ది చెత్తను సేకరిస్తున్నారు. ప్రతీ రోజూ 2.8 నుంచి 3టన్నుల వరకు చెత్తను సేకరించి దీని నుంచి తడి చెత్తను వేరు చేసి రెండు టన్నులకు పైగా చెత్తను బందంకుంట సమీపంలో పడేస్తున్నారు. చాలాకాలంగా ఇక్కడ చెత్తను పడేస్తుండటంతో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. తీవ్ర దుర్గంధంతో రోడ్డు పక్కన వెళ్తున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తకు నిప్పు పెడుతుండటంతో ఈ ప్రాంతాలు పొగమయమై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి పట్టణానికి దూర ప్రాంతంలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తాం..

- ఎమ్మెల్యే రాంచంద్రునాయక్



దంతాలపల్లి: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

దంతాలపల్లి: రైతులు వానాకాలం సీజన్‌లో పండించిన వరిధాన్యం చివరి గింజ వరకూ కొనుగోలు చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని రామానుజపురం, పెద్దముప్పారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధాన్యం సరైన పద్ధతిలో కాంటాలు పెట్టకున్న రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. రైతులకు అన్ని వసతులు కల్పించాలని కోరారు. అనంతరం మహాత్మ జ్యోతిరావు పూలే పాఠశాలలో సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలు ఎమ్మెల్యే నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఏసీఎస్సీ చైర్మన్ సంపెట రాము, ఏఎంసీ వైస్‌చైర్మన్ బట్టునాయక్, తాసీల్దారు కాటం చంద్ర రాజేశ్వర్, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఏఓ వాహిని, ఆర్‌ఐ నజీముద్దీన్, ఎంపీఓ అప్సర్‌పాషా, నాయకులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మరిపెడ రూరల్: పత్తి రైతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధరకు విక్రయించాలని ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అన్నారు. మరిపెడ మండలం బుర్హాన్‌పురం గ్రామ పరిధిలోని పద్మావతి కాటన్ ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, వైస్ చైర్మన్ ఐలమల్లు, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, రఘువీరరెడ్డి, తాజుద్దీన్, వెంకట్‌రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, గంగయ్య పాల్గొన్నారు.

ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మహబూబాబాద్: కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ఆశవర్కర్లు

మహబూబాబాద్: ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బి.అజయ్‌సారథిరెడ్డి, ఆశ వర్కర్ల యూనియన్ జిల్లా కన్వీనర్ పి.రజని, నాయకులు రేషపల్లి నవీన్, రేణుక, జ్యోతి డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ ఆశవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆశవర్కర్లు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉపేంద్ర, మాదవి, హసీనా, లక్ష్మి, రమ, కళావతి, నాగలక్ష్మి, రేణుక, పద్మ, కోమలి, మంద శంకర్, పెరుగు కుమార్, శ్రావణ్, వికాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కేసముద్రం: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌కు ఆశలు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే మురళీనాయక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మల్లీశ్వరి, దేవేంద్ర, పుష్ప, స్పందన పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని కొత్తబజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ నవ్య శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

కురవి: కురవి గ్రామంలో నేడు(శనివారం) ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చిన్నగూడూరు: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ నవ్య తెలిపారు.

రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాస్

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రం నుంచి పత్తిపాక, రాజాలీపేటకు వెళ్లే రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ డిమాండ్ చేశాడు. పార్టీ పట్టణ కమిటీ మహాసభ హేమానాయక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిపివేయడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని, ఎంపీ, ఎమ్మెల్యే ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశాడు. ఈ సమావేశంలో నాయకులు సూర్నపు సోమయ్య, సమ్మెట రాజమౌళి, బానోత్ సీతారాంనాయక్, యమగాని వెంకన్న పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో పార్టీ మండల 8వ మహాసభ నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న హాజరై మాట్లాడారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టర్లు

మహబూబాబాద్: పెండింగ్ బిల్లులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ మానుకోట అధ్యక్షుడు బోయినపల్లి లక్ష్మణ రావు ఆవేదన వ్యక్తం చేశాడు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట కాంట్రాక్టర్లు ఆందోళన చేసి కమిషనర్ నోముల రవీందర్‌కు, డీఈ సీహెచ్ ఉపేందర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ.. పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయం చుట్టు తిరుగుతున్నారన్నారు. పెండింగ్ బిల్లులు 15రోజుల్లో విడుదల చేయకపోతే మానుకోట మున్సిపాలిటీలో నిరవధికంగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు మార్నేని రఘు, రావుల సతీష్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఉపేందర్, రాజు, రాజేష్, సమద్, కిరణ్ పాల్గొన్నారు.

‘వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం’



మాట్లాడుతున్న మాణిక్యరాజ్

డోర్నకల్: మాలలతోపాటు ఉపకులాలకు తీవ్ర అన్యాయం జరిగే ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టనున్నట్లు ఆల్ ఇండియా బుద్దిస్ట్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు చిలకబత్తిని మాణిక్యరాజ్ తెలిపారు. స్థానిక సుభాష్‌వీధిలో శుక్రవారం మాల, లంబాడీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాణిక్యరాజ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో మాలలతోపాటు ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని, కొంతమంది స్వార్థంతో వర్గీకరణ ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షులు ఇట్టమల్ల యశ్వంత్, అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు మంగు రాజ్‌కుమార్, లంబాడా సంఘ నాయకులు బాలునాయక్, పెంట్యానాయక్, శరత్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక.. అభినందనలు



కురవి: రగ్బీకి ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



డోర్నకల్: రగ్బీకి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు



కేసముద్రం: బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన గణేశ్



కొత్తగూడ: కబడ్డీకి ఎంపికైన హర్షిణి

కురవి: రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని మోద్గులగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు తేజావత్ నిఖిల్, బేగావత్ సోనియాలు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం మొత్కూరి సత్యనారాయణచారి, పీడీ దార్ల సునీల్ శుక్రవారం తెలిపారు. మండలంలోని గుండ్రాతిమడుగు(విలేజి) జెడ్పీ హైస్కూల్‌కు చెందిన జి.చందు రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కె.జానయ్య, పీడీ పిల్లి కమల్‌కిశోర్ తెలిపారు. వీరిని ఉపాధ్యాయులు అభినందించారు.

డోర్నకల్: మండలంలోని చిలుకోడు శివారు మోడల్ స్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ఎంపికయ్యారు. డోర్నకల్ బిషప్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–17 రగ్బీ పోటీల్లో డి.త్రిష, బి.షర్మిల, అశోక్ ప్రతిభ కనబర్చి ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ కృష్ణభాను, పీడీ గోవర్ధన్ అభినందించారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎంపిక

నర్సింహులపేట: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడలకు నర్సింహులపేట హైస్కూల్‌కు చెందిన బి.వరుణ్ సందేశ్ ఎంపికైనట్లు శుక్రవారం పీడీ శంకర్‌నాయక్ తెలిపారు. ఉపాధ్యాయ బృందం రూ.3వేలు ఆర్థికంగా అందజేశారు. హెచ్‌ఎం రామ్మోహన్‌రావు, వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ పోటీలకు..

చిన్నగూడూరు: మండలంలోని జయ్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సాయిమాధవ్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక కాగా, అదే పాఠశాలకు చెందిన విద్యార్థులు జశ్వంత్, మహేష్, ప్రవీణ్, విజేందర్ రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఉషశ్రీ తెలిపారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు..

కేసముద్రం: మేడ్చల్ జిల్లా కొంపల్లిలో ఈనెల 9వ తేదీ నుంచి 11 వరకు నిర్వహించే అండర్–14 బాస్కెట్ బాల్ పోటీలకు కేసముద్రంస్టేషన్ జెడ్పీహైస్కూల్‌కి చెందిన విద్యార్థి పందుల గణేశ్ ఎంపికైనట్లు పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు. హెచ్‌ఎం బి.రాజు, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు..

కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న హర్షిణి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విష్ణువర్ధన్ శుక్రవారం తెలిపారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

తొర్రూరు రూరల్: జిల్లాస్థాయిలో జరిగిన చెస్ పోటీల్లో మండలంలోని గోపాలగిరి స్కూల్‌కు చెందిన విద్యార్థిని వెన్నమాల దక్షిక ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ంది. శుక్రవారం హ్యూమాన్ రైట్స్ ఆధ్వర్యంలో స్వీట్లు తినిపించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు.

ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం నిత్యం శ్రమించే గొప్పనాయకుడు సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్ రూరల్: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మురళీనాయక్, తదితరులు



తొర్రూరు: వేడుకల్లో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, నాయకులు



పెద్దవంగర: కాంగ్రెస్ కార్యాలయంలో..



గార్ల: వేడుకల్లో పాల్గొన్న నాయకులు



కురవిలో..

సంక్షిప్త సమాచారం

జాతర పనుల పరిశీలన

కురవి: మండలంలోని కందికొండ గుట్ట వద్ద జరుగు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి జాతర పనులను మండల అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈనెల 15న కందికొండ జాతర ఉండడంతో పనులను వేగవంతంగా చేయాలన్నారు. కార్యక్రమంలో మండల స్పెషల్ అధికారి నర్సింహస్వామి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, శారద, ఏఈలు పాల్గొన్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

కొత్తగూడ: మండలకేంద్రం నుంచి పొగుళ్లపల్లి రోడ్డుపై బ్రిడ్జి నిర్మించి మట్టి పోసి వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రోడ్డు పనులు పూర్తి చేయాలని సీపీఐ(ఎంఎల్), ప్రజాపంథా మాస్‌లైన్ మండల నాయకుడు ల్యాదల్ల రాజు డిమాండ్ చేశాడు. శుక్రవారం ఆయన మాట్లాడారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

గార్ల: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా నిర్వహించాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ జర్పుల సుధాకర్ నాయక్‌కు అందజేశారు.

పాఠశాలల తనిఖీ

నర్సింహులపేట: మండలంలోని కౌసల్యదేవిపల్లి, రామన్నగూడెం, రూప్లాతండా పీఎస్‌లను శుక్రవారం ఎంఈఓ రామ్మోహన్‌రావు తనిఖీ చేశారు. రికార్డులను, రిజిస్టర్లను, పాఠశాలల పరిసరాలను పరిశీలించారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

గార్ల: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ అధికారి కావటి రామారావు కోరారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో కొనుగోలు కేంద్రాల నిర్వహణపై రెవెన్యూ, వ్యవసాయ, ఐకేపీ శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో డీటీ సుధాకర్, శ్రీరామ్, ఆర్‌ఐ రామకృష్ణ, ఏఈఓ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

‘మాట తప్పిన కాంగ్రెస్’

మరిపెడ: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా కొత్త రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు లేవని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లూ సుధాకర్‌రెడ్డి అన్నారు. మరిపెడలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్దానాలు చేసి నేడు మాట తప్పిందన్నారు. ఈ సమావేశంలో బాలకృష్ణ, రషీద్, సమ్మయ్య, కృష్ణ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాక్కుల సదానందం తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల టీజీఓ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో బీఎస్పీయూ రాష్ట్ర కన్వీనర్ మంద శశికుమార్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పాటి అనిల్ కుమార్ శుక్రవారం మార్యదపూర్వకంగా కలిసి సన్మానించారు. మర్షల్ ఆర్ట్స్ పోటీలో వెండి పథకాన్ని సాధించిన విద్యార్థిని హతీయతహనీయత్‌ను సదానందం అభినందించారు.

బాధ్యతల స్వీకరణ

గంగారం: గంగారం ఇన్‌చార్జీ ఎంఈఓగా స్థానిక జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల హెచ్‌ఎం రమాదేవిని నియమిస్తు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఉపాధ్యాయులు సన్మానించారు.

బైక్‌లు ఢీ.. ఇద్దరికి గాయాలు

మరిపెడ రూరల్: మండలంలోని దంట్లకుంట తండా గ్రామ పంచాయతీకి చెందిన భూక్య విజయ్ తన భార్యతో కలిసి శుక్రవారం పొలం పనులు ముగించుకొని ద్విచక్రవాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో వీరారం గ్రామానికి చెందిన గండమల్ల నవీన్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై ఎదురుగా వస్తు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో భూక్య విజయ్ తలకు తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. గాయాలైన మరో యువకుడు నవీన్‌కు స్థానికంగా చికిత్స అందిస్తున్నారు.

యువకుడి తలకు తీవ్రగాయం

గార్ల: గార్లలోని పుట్టకోట బజారుకు చెందిన కోటేష్ రైళ్లలో సమోసాలు అమ్ముకుంటు జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఒక్కసారిగా ఫిట్స్ రావడంతో రోడ్డుపై పడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.

7క్వింటాళ్ల నల్లబెల్లం సీజ్

మరిపెడ రూరల్: ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 7క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై సతీష్ తెలిపారు. మండలంలోని స్టేజితండా శివారు వరంగల్–ఖమ్మం హైవేపై పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానస్పదంగా ఉన్న తవేరా వాహనం తనిఖీ చేయగా బెల్లం, పటిక పట్టుబడినట్లు తెలిపారు. వాహనాన్ని స్వాధీన చేసుకొని బెల్లం తరలిస్తున్న స్టేజితండాకు చెందిన భూక్య చందులాల్, ఉగ్గంపల్లి మచ్చుతండాకు చెందిన గుగులోతు నరేష్, నీలికుర్తి గ్రామ పరిధికి చెందిన గుగులోతు సురేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో పోరాడుదాం..

గంగారం: విప్లవోద్యమవీరుల ప్రాణ త్యాగాల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాడుదామని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, గంగారం, కొత్తగూడ మండలాల సంయుక్త కార్యదర్శి పూణెం ప్రభాకర్ అన్నారు. మండలంలోని గ్రామాల్లో సీపీఐ జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జోగ రాములు, వెంకటయ్య, పాపయ్య, సురేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: మండలంలోని వెలికట్ట గ్రామంలో ధ్వజస్తంభం, బొడ్రాయి, నూతన ఆలయాల్లో శివాంజనేయస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య, నవగ్రహ వంటి విగ్రహాల ప్రతిష్ఠాపన వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. వేడుకులకు ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆమెకు వేద పండితులు పూర్ణ కుంభాలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, నాయకులు దేవేందర్‌రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.